క్లుప్తంగా

కలాం చేయూత సేవాకార్యక్రమం



సత్తెనపల్లి: కలాం చేయూత కార్యక్రమ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వెలుగూరి శరత్ బంధుమిత్రుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని 31వ వార్డు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కస్తాల సైదమ్మకు తోపుడు బండిని మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా బుధవారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు , వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, పల్నాడు జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలక జైపాల్, షేక్ జానీ, కాకుమాను రవి, తుమ్మల వెంకటేశ్వర రావు, జూపల్లి పాల్, తదితరులున్నారు.

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటల పరిశీలన

పెదకూరపాడు: మండల వ్యాప్తంగా మిచాంగ్ తుఫాన్‌తో నీట మునిగిన మిర్చి, పత్తి పంటలను సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు.పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు మండలాల్లో భారీ వర్షానికి పొంగిపొర్లిన వాగులు, మిర్చి పంట నీట మునిగిందన్నారు. చినమక్కెన, లగడపాడు, కంభంపాడు, పరస గ్రామాల్లో మిర్చి పంటను పరిశీలించారు. మిర్చి పంటకు రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టారని, పంట చేతికి వచ్చే సమయానికి తుఫాన్ రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది పంట నష్టం అంచనాలు వేయాలని కోరారు. పంటలను పరిశీలించిన వారిలో పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి బైరవపట్నం రామకృష్ణ, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు, చల్లపల్లి సామేలు ఉన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ సమావేశం

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 22 నుంచి మార్చి 23) వరకు నిర్వహించిన పనుల సామాజిక తనిఖీపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఎంపీడీవో ఎం.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివ రామయ్య, ఏపీవో వెంకటేశ్వరరావులు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమ కోఆర్డినేటర్ ఎస్ఆర్‌సీ బుజ్జి నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ గురువారం నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో డీఆర్‌సీలచే ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ జరిపి గ్రామ సభ నిర్వహించటం జరుగుతుందన్నారు. జరిగిన పనులు, జరగని పనుల నివేదికల ప్రకారం మండల సామాజిక తనిఖీ బహిరంగ సభలో చదవటం జరుగుతుందన్నారు. ఉపాధిహామీ పనులు రూ.4.5 కోట్లు, పంచాయతీరాజ్ పనులు రూ.3.5 కోట్లుకు సంబంధించిన సామాజిక తనిఖీలు జరుగుతాయన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు పంచాయతీల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యార్థినుల పట్ల అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించేది లేదు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): పాఠశాలలోని విద్యార్థినులకు అందించే వసతుల పట్ల అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించేదిలేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో కేజీబీవీ పాఠశాలను బుధవారం పరిశీలించి అందుతున్న వసతులపై సిబ్బందితో మాట్లాడారు. వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటానన్నారు. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, విస్మరిస్తే తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. భోజనానికి అవసరమైన సరుకులు ఎన్ని రోజుల నుంచి రావటం లేదని, ఆహారం అందించటంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారో చెప్పాలన్నారు. సరుకులు రాక ఆరురోజులైందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ విషయా న్ని జిల్లా కలెక్టర్‌తోను మాట్లాడతానని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినులకు వెంటనే వైద్య సేవలందించాలని ఆదేశించారు.

మీ పిల్లలైతే ఇలానే చేస్తారా..

మీ ఇంట్లో మీ పిల్లలైతే ఇలానే పస్తులు ఉంచుతారా...మూడు రోజుల నుంచి మంచినీరు లేకుండా ఉంటే ఏం చేస్తున్నావంటూ సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి పాఠశాల ప్రత్యేకాధికారిని ప్రశ్నించారు. వర్షంతో పిల్లలు ఇబ్బందులు పడుతుంటే కనీసం అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదో చెప్పాలన్నారు. పాఠశాలలో పనిచేసే సిబ్బంది ఇక్కడ ఎందుకు ఉండటం లేదు...పాఠశాలలో ఎంతమంది ఆహారాన్ని తీసుకుంటున్నారు..సరుకుల నిల్వకు సంబంధించిన రికార్డులను తీసుకొనిరావాలని ఆదేశించారు.

రహదారి అంచనాలు తయారు చేయండి..

పాఠశాలకు రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.శామ్యూల్ ఆదేశించారు. జలదిగ్బంధంలో ఉన్న పాఠశాలను బుధవారం పరిశీలించారు. లోపలికి వెళ్లేందుకు దారి లేకపోవటంతో బయటే ఉండి పాఠశాల సిబ్బందితో మాట్లాడారు.

మిచాంగ్ తుఫాన్ ఎఫెక్ట్.. సత్వర చర్యలు

- రెండు రోజుల పాటు ఎడతెరిపిలేని వర్షం
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు
- 103 కుటుంబాలకు నిత్యవసరాలు, కూరగాయలు పంపిణీ
- పట్టణంలో 252 మందికి మూడు చోట్ల ఆహారం పంపిణీ



పాకాల పాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు



రాజుపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



గుండ్లపల్లిలో వరిని జడలు కట్టిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు, ఏపీ



రాజుపాలెం మండలంలో అరటి తోటలను పరిశీలించిన ఉద్యాన అధికారి



పట్టణంలోని ఆరో వార్డులో పర్యటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు



క్రోసూరు మండలం ఉయ్యందన వాగు ఉధృతి

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్ రెండు రోజులపాటు సత్తెనపల్లిలో ప్రభావం చూపించింది. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన తుఫాన్ అలజడి సోమ, మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. ఓవైపు ఈదురు గాలులు, మరోవైపు వర్షం కురవడంతో జన జీవనం స్తంభించిపోయింది. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజులపాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు మూతపడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గ పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టమూరు, కొమెరపూడి, పాకాలపాడు ప్రాంతాల్లో 55 హెక్టార్లలో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. కట్టమూరు, నందిగామ, పెద్దమక్కెనలో మిర్చి పంట 200 హెక్టార్లలో, కంటెపూడి, కొమ్మెర పూడి, నందిగామ, గుడిపూడి, సత్తెనపల్లి, భీమవరం, లక్కరాజుగార్లపాడులో 254 హెక్టార్లలో శనగ పంట నష్ట పోయింది. గుడిపూడి, పాకాలపాడు ప్రాంతాల్లో నాలుగు హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లింది. ఆయా ప్రాంతాల్లో రైతులు పంట పొలాల్లోని నీటిని పొలాల్లో నుంచి బయటకు వెళ్ళబెట్టే ప్రయత్నాలు బుధవారం చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నందిగామలో పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులకు సూచనలు చేసి రైతులకు భరోసా కల్పించారు.

లోతట్టు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు....

పట్టణంలోని మాచర్ల రోడ్‌లో నీటి గోనెల కారణంగా వర్షపు నీరు ప్రవహించకుండా వెనక్కి రావడంతో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు నేతృత్వంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక పొక్లెయిన్ ద్వారా మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో నీటి గోనెలను తొలగింపు చేయించారు. అప్పటికే 22, 23 వార్డుల్లోకి నీరు ప్రవహించింది. గోనెలను తొలగించడంతో నీటి ప్రవాహం తగ్గిపోయి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మూడవ వార్డు మాస్టీన్ పేటలో ఇళ్లలోకి నీరు చేరడంతో 150 మందిని పునరావాసం నిమిత్తం తరలించారు. వారికి మంగళవారం రాత్రి అల్పాహారాన్ని అందించారు. పట్టణంలోని 22వ వార్డులో ఇరువురు వృద్ధులను వేణుగోపాల స్వామి దేవాలయ మండపంలోకి తరలించారు. పట్టణంలోని ఐదు,ఆరు వార్డులకు చెందిన 100 ఇళ్లల్లోకి నీరు చేరటంతో వారిని పునరావాసం నిమిత్తం తరలించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి, ఆమె భర్త సదనం హరి మిత్ర బృందం వారికి ఆహారాన్ని అందించారు. ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి సందర్శించి ముంపు వాసులకు ధైర్యం చెప్పారు. బుధవారం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, సదనం హరి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, నాయకులు వార్డులో పర్యటించారు. విద్యుత్‌ను పునరుద్ధరింప చేశారు. 100 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని నందిగామలో మూడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణం లో 4,5 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది.

పొంగిన వాగులు.. నిలిచిపోయిన రాకపోకలు

క్రోసూరు: మిచాంగ్ తుఫాన్ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం కురిసిన వర్షానికి వాగులు పొంగి ప్రవహించి లోలెవల్ చప్టాల మీదగా ఉధృతంగా ప్రవహించాయి. బుధవారం పలు గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని ఊటుకూరు గ్రామం వద్ద కప్పల వాగు ఉధృతంగా ప్రవహించటంతో అమరావతి వైపుగా క్రోసూరు, అచ్చంపేట వెళ్లేందుకు రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. అదేవిధంగా మండలంలోని అందుకూరు గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించటంతో బాలెమర్రు, అందుకూరు గ్రామాల నుంచి క్రోసూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని 88త్యాళ్లూరు నుంచి ఉయ్యందన గ్రామాల మధ్యగల వాగు పొంగి ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రాత్రికి ఎగువన వర్షాలు లేకపోతే గురువారం ఉధృతి తగ్గుతుందని అధికారులు తెలిపారు. వాగుల వద్ద పోలీసులు, గ్రామనౌకర్లు వాగుల మీదగా అటుఇటు ప్రయాణికులు రాకుండా పహారా కాస్తున్నారు.

తుఫాన్ ప్రభావంతో రైతులకు అపార నష్టం

బెల్లంకొండ: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల రైతుల పంటలు నీట మునిగాయి. దీంతో పంట చేతికి అందుతుందన్న సమయంలో అకాల వర్షానికి అపార నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలోని వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, పాపాయపాలెం, మచాయపాలెం, నందిరాజుపాలెం, చంద్రాజుపాలెం , కందిపాడు, వన్నాయపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో మిర్చి పంటలు పడిపోయాయి, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. కోత దశలో ఉన్న వరి పైరు నేలకొరిగింది. ఈదురుగాలులతో మునగ తోటలు విరిగి, నేల వాలాయి. పత్తి పంట తీత దశకు వచ్చిన సమయంలో కూలీల కొరత, తుఫాన్ రావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

పంటపొలాలను పరిశీలించిన ఉద్యానాధికారులు

రాజుపాలెం: మిచాంగ్ తుఫాన్ వలన కురిసిన వర్షాలకు దెబ్బతిన్న, నీట మునిగిన పంటలను ఉద్యాన అధికారి డి.నవీన్ మండలంలోని గణపవరం, బలిజేపల్లి, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 ఎకరాలు టమాటా తోటలు, 55 ఎకరాల అరటి, 20 ఎకరాల మునగ ఈదరుగాలులకు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. అదే విధంగా 556 ఎకరాల మిర్చి తోటలు నీట మునిగినట్లు తెలిపారు. ఈ ప్రాథమిక సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని తెలిపారు. అధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే మరలా పంటపొలాలను పరిశీలించి పంటల నష్టాన్ని అంచనావేస్తామని తెలిపారు. ఆయన వెంట రైతులు, సిబ్బంది తదితరులున్నారు.

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి..

మండలంలోని కోటనెమలిపురి, అంచులవారిపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య వరి, కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు అందించారు. నీట మునిగిన వరి పంటను కాపాడుకునే విధంగా నివారణ చర్యలు తెలిపారు.

వరి పంటలను పరిశీలించిన ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట: మిచాంగ్ తుఫాన్ వల్ల గత రెండు రోజులుగా మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాలిపోయిన వరి పంటలను బుధవారం వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. చిగురుపాడు, వేల్పూరు, పెదపాలెం, కోగంటివారిపాలెం, ఓర్వకల్లు తదితర గ్రామాలలో వరి పంటల నష్టాలపై అంచనావేశారు. అచ్చంపేట మండలంలో 685 ఎకరాలలో వరి పంట వేయడం జరిగిందన్నారు. వర్షం వల్ల సుమారు 285ఎకరాల పంట నీటమునిగినట్లు చెప్పారు. నష్టపోయిన పంట శాతాన్ని ఈనెల 10 నుంచి సర్వే చేయనున్నట్లు చెప్పారు. తక్షణమే రైతులు పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా పొలంలో నిలబడిన నీటిని తక్షణమే బయటకు వెళ్లకట్టాలన్నారు. పడిపోయిన వరిపంటను కట్టలుగా కట్టుకోవాలని చెప్పారు. చేనుమీద తడిసిన కంకులు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటికి కలిపి మొక్కలు బాగా తడిసేవరకు పిచికారి చేయాలన్నారు. మండలంలో 13045 ఎకరాలలో పత్తి పంట వేసినట్లు చెప్పారు. ఇప్పటికి రెండు దఫాలుగా పత్తి తీశారని, మూడవకోత సమయంలో పత్తి తడిసిపోయినట్లు చెప్పారు. పత్తిలో నిలబడిన నీటిని బయటకు వెళ్లగట్టి ఎకరాకు 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్ కలిపి పంటలపై జల్లినట్లయితే తేమ శాతాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. రైతులెవ్వరు అధైర్య పడాల్సిన పనిలేదని, తడిసిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారి నాయక్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

తడచిన పంటలను కాపాడేందుకు చర్యలు

నకరికల్లు: వర్షానికి తడచిన పంటలను రక్షించుకునేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని పిడుగురాళ్ల సహాయ వ్యవసాయ సంచాలకులు బి.కృష్ణదేవరాయలు రైతులకు, సిబ్బందికి సూచించారు. తుఫాన్ కారణంగా మండలంలో తడచిన పంటలను మండల వ్యవసాయాధికారి కె.దేవదాసుతో కలసి బుధవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులు స్వయంగా పొలాల్లోకి దిగి వాలిపోయిన వరిని జడలు కట్టించారు. నీళ్లు నిలచిన పొలాల్లో చిన్నకాలువలు తీయించి నీటిని బయటకు వెళ్లగట్టే చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వరి, కంది, మొక్కజొన్న, శనగ, మినుము తదితర పంటలను పరిశీలించినట్లు తెలిపారు. వరిగింజలు మొలకెత్తకుండా, రంగుమారకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని వరిపై పిచికారీ చేయాలని సూచించారు. కంది, మొక్కజొన్న, శనగ, మినుము పొలాల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్లగట్టాలన్నారు. ఎకరాకు ఒకకేజీ మల్టీకే, 200లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కందిలో ఎకరాకు 20కేజీల యూరియా, 10కేజీల పొటాష్‌ను కలిపి చల్లాలని సూచించారు. మొక్కజొన్నలో ఎకరాకు 50కేజీల యూరియా, 20కేజీల పొటాష్ కలిపి చల్లాలన్నారు. శనగలో లీటరు నీటికి 5గ్రాములు ఫెర్రస్ సల్ఫేట్, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభాకర్, సుభాని, ఎం.ప్రసన్న పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మిచాంగ్ తుఫాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాలను, పంట పొలాలను అధికారులు బుధవారం పరిశీలించారు. గోళ్ళపాడు గ్రామంలో జలదిగ్బంధంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను తహసీల్దార్ భవానిశంకర్ సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి అవసరమైన తాగునీటిని సరఫరా చేయించారు. గోళ్ళపాడులోని ఎస్టీ కాలనీలో ముంపునకు గురైన 32 గృహాలలోని వారిని ఆర్బీకేలోకి తరలించి అక్కడే పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. వారికి ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ఆహారం , వసతి సౌకర్యాలను కల్పించారు. పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో రాజకుమారి, సర్పంచ్ అప్పమ్మ పర్యవేక్షించారు. తొండపి-గణపవరం రహదారిలోని లోలెవల్ చప్టాపై వరద నీరు ప్రవహించటంతో రెండు చోట్ల కోతకు గురైంది.

దెబ్బతిన్న పంటలు పరిశీలన....

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది పరిశీలించారు. ముప్పాళ్ళ, తొండపి, దమ్మాలపాడు, ఇరుకుపాలెం, బొల్లవరం, మాదల గ్రామాల్లో దెబ్బతిన్న మిరప, అరటి, వరి పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సత్తెనపల్లి ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ జనని, దమ్మాలపాడు, తొండపి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. గోళ్ళపాడు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను మండల వ్యవసాయాధికారి ఎం అరుణ పరిశీలించి ముంపు నుంచి పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

నీటమునిగిన ప్రతి ఎకరాను గుర్తిస్తాం



దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: మండలపరిధిలో నీట మునిగిన ప్రతి ఎకరాను గుర్తించి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు సాయం చేయటానికి కృషి చేస్తామన్నారు. నీట మునిగిన పొలాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా గుర్తించి అంచనాలు తయారు చేస్తారన్నారు. ఈ పర్యటనలో తొలుత నరుకుళ్ళపాడు అమరావతి, పెదమద్దూరు, ధరణికోట, దిడుగు, మల్లాది, జూపూడి, మునగోడు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే పంటపొలాల నీటమునగటం వల్ల కలిగిన నష్టం రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ పంటలుగా శనగ వేసే రైతులకు వెంటనే విత్తనాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో ఉమాదేవి, ఏవో అహ్మద్‌లతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పార్టీ నాయుడు రాంబాబు, మంగిశెట్టి కోటేశ్వరరావు, ఆలా లక్ష్మీనారాయణ, అధికారప్రతినిధి నండూరు కరుణకుమార్, అళ్ళ శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా ఉంటాం

అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. తుపాను బాధితులకు అమరావతి పల్లోటి కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. బాధితులను పరామర్శించి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మిచాంగ్ తుఫానును తమ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. తుపాను ప్రభావిత 8 జిల్లాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.110 కుటుంబల వారికి శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో వాగులు, వంకలు ఇంకా పొంగుతూనే ఉన్నాయని.. ప్రజలు మరో 24 గంటలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సందర్భంగా అమరావతి సత్తెనపల్లి రోడ్డు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



చిగురుపాడులో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది



బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెంలో నేలకొరిగిన మునగతోట



పొంగి ప్రవహిస్తున్న క్రోసూరు మండలం ఊటుకూరు కప్పలవాగు



గోళ్ళపాడు కేజీబీవీలో నిల్వ ఉన్న వర్షపు నీరు



కట్టమూరులో వరి పొలం జలమయంగా మారడంతో ఆవేదన చెందుతున్న రైతు

అంబేడ్కర్ మార్గంలో జగన్ సుపరిపాలన

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వాడవాడలా బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు



సత్తెనపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అనంతరం తాలూకా సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో 200 మంది అనాథలకు అన్నసంతర్పణ నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఎస్సీసెల్ అధ్యక్షులు చిలక జైపాల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరా నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, బండి మల్లికార్జునరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డీబీఆర్సీ ఆధ్వర్యంలో...

భారత రత్న డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సభ్యులు జిల్లా నాయకులు ఉన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో ....

పట్టణంలోని తాలూకా సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంఘ నాయకులు, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడవాలి

క్రోసూరు: భారత రాజ్యాంగ నిర్మాత, ఆదర్శనీయుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలని కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి గార్లపాటి దాసు అన్నారు. బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ వద్ద అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అప్పిరెడ్డి, దాసయ్య, శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలు, కె.అంజనేయరెడ్డి, అప్పారావు, షేక్ గఫూర్, అనుముల కోటిరెడ్డి, డాక్టర్ షరీఫ్, ఎం.రోశయ్య, చిల్కా రవి, జీవరత్నం, బయ్యవరపు మస్తాన్‌రావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు ఆద్యుడు అంబేడ్కర్

అచ్చంపేట: ప్రజాస్వామ్య విలువలకు ఆద్యుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైస్ ఎంపీపీ గంగసాని బాబు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. అంబేడ్కర్ అణగారిన వర్గాలను పైకి తీసుకు వచ్చేందుకు అనేక సంస్కరణలు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సందెపోగు లక్ష్మణబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శిఖా తిమోతి, టౌన్‌పార్టీ కన్వీనర్ సమరం, దాసుబాబు, పున్నారావు, సంసోను, అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

నకరికల్లు: రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వి. పిలుపునిచ్చారు. నకరికల్లులో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కులమతాల మూఢాచారాలను తరిమికొట్టి ప్రజల్లో చైతన్యం నింపి సమసమాజస్థాపనకు పాటుపడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్రనాయకుడు కోటానాయక్, రహమాన్, గని, లాలు పాల్గొన్నారు.

బీసీలకు సరైన గుర్తింపు కోసమే కులగణన

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కులగణన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: రాష్ట్రంలో బీసీలకు సరైన గుర్తింపు కల్పించేందుకు కులగణన చేపట్టినట్టు పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. బుధ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కులగణన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంపీపీ హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, చట్టసభల్లో ప్రాతినిధ్యం వంటి వాటిలో న్యాయం జరిగేందుకే కులగణన చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సర్వే జరుగుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సాయంతో కులగణన చేపట్టనున్నట్టు తెలిపారు. కులగణనలో ప్రజలు కూడా నిజాయితీగా తమ వివరాలను అందజేయాలని కోరారు. ఎన్నికలు, ప్రభుత్వ, నామినేటెడ్ పదవులను కూడా జనాభా ప్రాతిపదికన అందించే అవకాశముంటుందన్నారు. అన్ని వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా పదవులు కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. తమ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. కులపరంగా జనాభా స్పష్టంగా తెలిస్తే వారికి దక్కాల్సిన ఫలాలు సక్రమంగా అందుతాయన్నారు. తొలుత అమరావతి మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, వివిధ కులాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.